# ఆకాశ వీధిలో

ఇండియాలో వున్నది పదిరోజులే అయినా, పెళ్ళికి వెళ్ళాను కనుక చూడవలసినవాళ్ళందర్నీ ఒకేచోట చూసే అవకాశం వచ్చింది. ఇటు పెళ్ళిసందడీ, అటు కావలసిన వాళ్ళందరిలోనూ సరదాగా గడపటం అన్నీ నెమరు వేసుకుంటూ తిరుగు ప్రయాణం కట్టాను.

హైద్రాబాద్‌నించీ బొంబే రావటానికి ఇబ్బందేమీ లేదు కానీ, బొంబేలో నేషనల్ ఎయిర్‌పోర్టునించీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కి రావటం మహా చిరాకు వేసింది. అసలు బొంబే ఎయిర్‌పోర్టు అశుభ్రంగా ఒక పద్ధతీ పాడూ లేకుండా వుంటుంది. దానికి తోడు ఎక్కడ చూసినా ఎయిర్‌పోర్ట్ మనుష్యులే కానీ, సహాయం మాత్రం శూన్యం. ఎయిర్‌పోర్ట్ బస్సులో వస్తుంటే అక్కడ ఒక పెద్ద బోర్డు. ఐసో 9000 సర్టిఫైడ్ అని! అంటే అక్కడ "క్వాలిటీ"తో పనులు చేస్తారని అర్థం!!

బొంబే- ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లైట్‌కి ఇంకా మూడు గంటల వ్యవధి వుంది. అక్కడే ఒక సోఫాలో కూర్చుని కొత్తగా కొన్న ముళ్ళపూడి వెంకటరమణగారి కదంబ రమణీయం పుస్తకంలో నవ్వితే నవ్వండి జోకులు చదువుతూ కూర్చున్నాను. మధ్యమధ్యలో ఆ హాస్యానికి ఘొల్లున వస్తున్న నవ్వుని ఎవరన్నా చూసి ఏమన్నా అనుకుంటారేమోనని బలవంతంగా ఆపుకుంటున్నాను.

నార్త్‌వెస్ట్ ఎయిర్‌లైన్‌వారి బోర్డింగ్ పూర్తయి నా సీట్లో కూర్చునేసరికి అర్ధరాత్రి ఒంటిగంటయింది. ఆమ్‌స్టర్‌డామ్‌లో ఐదు గంటలు వైటింగ్. అక్కడి నించీ మినియాపొలిస్. అక్కడింకో నాలుగు గంటలు వైటింగ్. మినియాపొలిస్ నించి ఆస్టిన్‌కి.. ఇదో అంతులేని ప్రయాణం. దాని గురించి ఆలోచించటం కన్నా, కొనుక్కున్న డజను తెలుగు పుస్తకాలలో కొన్నయినా చదవుకోవటం మంచిది. లేదా ఏనాటినించో వ్రాద్దామనుకుని, వ్రాయని కథలు వ్రాసుకుంటూ సమయం గడపటానికి ఇదో సదవకాశం. అందుకే ముందుగా ఓ గంట నిద్రతీద్దామని, సీటునో వెనక్కి జారగిలబడి కళ్ళు మూసుకున్నాను.

అరగంట గడిచాక టేకాఫ్ ఎనౌన్స్‌మెంట్. ప్లేన్ బయల్దేరింది. కళ్ళు తెరిచి చుట్టూ పరిపార చూశాను. ఆ విమానంలో ఇటు రెండు, అటు రెండు, మధ్యలో నాలుగు సీట్లున్నాయి. నాకెప్పుడూ విండో సీటుకన్నా ఐల్ సీటులో కూర్చోవటం ఇష్టం. మధ్యలో లేచి తిరగటానికీ, కాఫీ కానీ మంచినీళ్ళు కానీ కావాలంటే లేచి వెళ్ళటానికీ అనువు. అందుకే నేను మధ్య రోలో ఐల్ సీట్ తీసుకున్నాను. నా పక్క విండో దగ్గర రెండు సీట్లలోనూ ఒకాయనా ఒకావిడా, తెల్లవాళ్ళు కూర్చున్నారు. వాళ్ళు మాట్లాడే భాష డచ్ కనుక, వాళ్ళు బిజినెస్ మీదో సైట్ సీయింగ్ కోసమో ఇండియా వచ్చి తిరిగిపోతున్నారని అర్థమవుతున్నది. విమానం దాదా

ష్ట నిండిపోయింది. నా పక్కనే కూర్చున్న దంపతులిద్దరూ అప్పుడే కునుకు తీస్తున్నారు. విమానం బయల్దేరింది. కునుకు తీయాలని అనుకున్నానే కానీ నిద్ర పడితే కదా. కొత్తగా కొన్న కొడవటిగంటి కథల పుస్తకం పేజీలు తిప్పుతున్నాను.

ఎయిర్ హోస్టెస్ డ్రింకులు తీసుకువచ్చింది. టొమోటో జ్యూస్ తీసుకుని నెమ్మదిగా తాగుతూ పుస్తకం చదువుతుంటున్నాను. అప్పుడే విమానం బయల్దేరి దాదాపు గంట అయింది.

కిటికీ దగ్గర సీటులో కూర్చున్నావిడకి వాంతులవుతున్నాయి. వాళ్ళాయన ముందు సీటు పాకెట్లోవున్న కాగితం సంచులు అందిస్తున్నాడు ఆవిడకి. నేను ఎయిర్‌హోస్టెస్‌ని రమ్మనమని అక్కడ వున్న చిన్న లైట్ వెలిగించాను. ఆమె నా దగ్గరికి రాగానే చెప్పాను ఆవిడకి సహాయం కావాలేమోనని పిలిచానని. కుర్చీని వెనక్కి లాగి, తల దగ్గర రెండు దిళ్ళు వేసింది. జింజరేల్ తెచ్చిచ్చింది, ఇది తాగితే తగ్గుతుందిఅంటూ. అక్కడే వున్న ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లోనించి డ్రామమిన్ టాబ్లెట్స్ కాసిని తీసి వేసుకోమని చెప్పింది. ఆవిడ మాత్రలు వేసుకున్న తర్వాత కొంచెం బాగానే వున్నట్టుంది. నేనూ పుస్తక పఠనంలో పడిపోయాను.

పదినిమిషాలు గడిచాయి. ఆవిడ తలవాల్చేసి పక్కకి పడిపోయింది. ఆయన గాభరాగా తట్టి లేపుతున్నాడు. ఆవిడ స్పృహతప్పి పడిపోయింది. నేను వెంటనే ఎయిర్‌హోస్టెస్‌ని పిలుచుకువచ్చాను. ఆవిడ తన ప్రయత్నాలు చేస్తుంటే, ఇంకొక హోస్టెస్‌కూడా వచ్చిందక్కడికి. వాళ్ళిద్దరూ మాట్లాడుకుని డాక్టర్ని పిలవటమవసరం అని నిర్ధారణ చేశారు. ఒక హోస్టెస్ వెళ్ళి మైక్‌లో చెప్పింది ఇక్కడ ఎమర్జెన్సీ వచ్చింది, "ఈ ఫ్లైట్లో ఎవరయినా డాక్టర్ వుంటే 23 ఎ సీటుకి వెంటనే రమ్మనమని. వచ్చేటప్పుడు వాళ్ళ ఐడెంటిఫికేషన్, లైసెన్స్ కూడా తీసుకురమ్మని చెప్పింది. చూస్తుండగానే నలుగురు డాక్టర్లు వచ్చారు. నలుగురూ భారతీయులే. ఏవో ప్రయత్నాలు చేశారు కానీ, అక్కడ పరీక్షలు చేయటానికి పరికరాలుకానీ ఇవ్వటానికి రకరకాల మందులు కానీ లేవు మరి. ఫస్ట్‌యెయిడ్ బాక్స్‌లోని మందులు, ఇలాంటి వాటికి చాలవు. వాళ్ళల్లో వాళ్ళే తర్జనభర్జన పడుతున్నారు. ఒక డాక్టర్ మాత్రం ఆవిడని పలకరిస్తూ కోమాలోకి వెళ్ళకుండా చూస్తున్నాడు. కానీ ఆవిడ ఇంకా అపస్మారకంగానే వున్నట్టుంది.

ఈలోగా పైలెట్ కాబోలు వచ్చాడు. అందరూ తక్షణ కర్తవ్యం ఏమిటా అని ఆలోచించారు. విమానం అరేబియా మహాసముద్రం మీద ఎగురుతున్నది.

పైలెట్ వెళ్ళిన మూడు నిమిషాల్లో అనౌన్స్‌మెంట్ వచ్చింది. అత్యవసర పరిస్థితివల్ల మనం బొంబేకి తిరిగివెడుతున్నాం. మీరందరూ సహకరించండి అని. అంటుండగానే విమానం వెనక్కి తిరిగింది.

నా పక్కన కూర్చున్న ఆయన అంటున్నాడు నిరాశగా "ఇప్పటికి గంటన్నర దూరం వచ్చాం. మళ్ళీ వెనక్కి వెళ్ళి, వెంటనే తిరుగు ప్రయాణం కడితే మూడు గంటలు వెనకపడతాం. మేము మెంఫిస్ వెళ్ళే ఫ్లైట్ వెళ్ళిపోతుంది!"

ఆయనతో అనలేదు కానీ, నాకసలు ఆమ్‌స్టర్‌డామ్‌లో ఐదు గంటల

టైమ్‌వుంది. అక్కడెలా గడపాలా అని సతమతమవుతున్నానాకు. ఆ ఐదు గంటల వ్యవధి వుండటం మంచిదయింది. ఆలస్యమయినా నేనా ఫ్లైట్‌ని అందుకోగలను.

అక్కడే నుంచున్న ఇండియన్ డాక్టర్ అడుగుతున్నాడు ఆ డచ్ అతన్ని "ఇంతకుముందేదన్నా అనారోగ్యం వుందా... " అని.

డచ్ యాసలో ముంచిన ఇంగ్లీష్‌లో అంటున్నాడాయన, "ఏమీ లేదు. విమానం ఎక్కేదాకా బాగానేవుంది. మరి ఏమయిందో. ప్రతిచోటా బాటిల్డ్ నీళ్ళూ శుభ్రమైన ఆహారం తింటూనే వున్నాం... ఎందుకిలా అయిందో.... "

డాక్టర్ అక్కడే నుంచుని మధ్యమధ్యలో ఆవిడ నాడి చూస్తున్నాడు. ఆవిడని పలకరిస్తున్నాడు. డచ్ ఆయన నెమ్మదిగా ఆవిడ నోట్లో కొంచెంకొంచెం జింజరేల్ పోస్తున్నాడు.

"డీహైడ్రేషన్ అనుకుంటాను... " అంటున్నాడు డాక్టర్.

విమానం బొంబే ఎయిర్‌పోర్ట్‌లో దిగి గేటు వేపు వెడుతున్నది. ఇద్దరు ఎయిర్ హోస్టెస్‌లు వచ్చారు అక్కడికి. విమానం తలుపు తెరవగానే ఒక డాక్టర్ ఒక నర్సు, స్ట్రెచ్చర్ తీసుకుని ఇద్దరు మనుష్యులు వచ్చారు. ఆవిడని స్ట్రెచ్చర్ మీద పడుకోబెట్టి బయటికి తీసుకువెళ్ళారు. ఆవిడ వెనకనే ఆయనా తన సామానుతో దిగాడు. రెండు సీట్ల అవతల నుంచున్న ఇంకొక డచ్ ఆయనతో ఏదో అని భుజం మీద తట్టాడు. సవ్యంగానే వుంటుందని ధైర్యం చెబుతున్నాడు కాబోలు.

ఈలోగా ఇద్దరు పనివాళ్ళు వచ్చారు. ఆ రెండు సీట్లూ శుభ్రం చేసి, అక్కడ స్ప్రేకాన్‌లతో ఫ్యూమిగేట్ చేశారు. ఇరవై నిమిషాల్లో విమానం మళ్ళీ... రెండోసారి... ఆమ్‌స్టెర్‌డామ్‌కి బయల్దేరింది.

టైమ్ చూసుకున్నాను. మొత్తం నాలుగు గంటలు ఆలస్యమయేటట్టుంది. అంటే నాఫ్లైట్‌కి ఆమ్‌స్టర్‌డామ్‌లో ఇంకా గంట టైముంటుంది. ఫరవాలేదు. అంతా మన మంచికే అనుకున్నాను. ఈలోగా ఎయిర్ హోస్టెస్ ఆలస్యానికి క్షమాపణలు చెబుతూ అందరికీ తలా ఒక ప్లాస్టిక్ సంచీ అందించింది.

అందులో ఏమున్నాయా అనే కుతూహలంతో తెరిచి చూశాను.

అది నార్త్‌వెస్ట్ విమాన సంస్థ ఆలస్యానికి క్షమాపణలతో అందించిన బహుమతి.

దాంట్లో ఆమ్‌స్టర్‌డామ్‌నించీ అమెరికాకి ఫోన్ చేసి, ఆలస్యమవుతుందని చెప్పటానికి పది డాలర్ల ఫోన్ కార్డు, ఆమ్‌స్టర్‌డామ్‌లో ఉచిత అల్పాహారానికి పది డాలర్ల కూపాన్, ఇంకొక సంవత్సరంలోగా వారి విమానంలో టిక్కెట్టు కొనుక్కుంటే యాభై డాలర్ల తగ్గింపు కూపాన్ మొదలైనవి వున్నాయి.

ఒక ప్రాణం నిలబెట్టటానికి చేస్తున్న ప్రయత్నంలో సహకారం అందించటం విశ్వ మానవ ధర్మం.

కష్టమర్లకి ఇబ్బందులు కలిగినప్పుడు అర్థం చేసుకుని వాళ్ళని తృప్తి పరచటం అమెరికన్ వ్యాపార ధర్మం.

* * *